తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు



ఆక్రమణలపై హైడ్రా కొరడా గచ్చిబౌలి టెలికాం నగర్‌లో 2500 గజాల పార్కు స్థలానికి విముక్తి

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 197 పేజీలు : 04 వెల రూ. 2 శుక్రవారం 23 - 01 - 2026

## దావోస్ వేదికగా
# రేవంత్ రెడ్డి , నారా లోకేశ్ భేటీ

- రేవంత్ రెడ్డిని కలిసిన నారా లోకేశ్
- స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా తెలుగు రాష్ట్రాల నేతల మధ్య స్నేహపూర్వక భేటీ
- పరస్పర సహకారంతో అభివృద్ధిపై ఇరు నేతల చర్చ
- ఏపీ విద్యా సంస్కరణలు, ఐటీ ప్రగతిని వివరించిన నారా లోకేశ్
- తెలంగాణ స్కిల్ క్యాంపస్‌లను చూడాలని లోకేష్‌కు రేవంత్ ఆహ్వానం
- దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చూపని చొరవతో రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్న రేవంత్ రెడ్డి
- మేడారం జాతరకు రావాలని లోకేష్‌ను ఆహ్వానించిన సీఎం



హైదరాబాద్ : స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా తెలుగు రాష్ట్రాల నేతల మధ్య స్నేహపూర్వక భేటీ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల అభివృద్ధి, ప్రగతి ప్రణాళికలపై ఇరువురు నేతలు ఫలవంతమైన చర్చలు జరిపారు. పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల సమగ్రాభివృద్ధి సాధ్యమని ఇద్దరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భాగంగా మంత్రి నారా లోకేశ్... సీఎం రేవంత్ రెడ్డిని మంగళగిరి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ప్రతిగా సీఎం రేవంత్ రెడ్డి కూడా లోకేశ్ ను సత్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న విద్యా సంస్కరణలు, ఐటీ రంగంలో సాధిస్తున్న ప్రగతిని లోకేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా - మిగతా 2 లో

## తెలంగాణలో బీసీ నేత
# సీఎం అయ్యే సమయం వస్తుంది

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తున్నామన్న మహేశ్ గౌడ్
- మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యమని వెల్లడి
- దేవుళ్ల పేరుతో రాజకీయాలు మంచిది కాదని వ్యాఖ్య
- కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు దక్కుతుందని,దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరన్న మహేశ్



హైదరాబాద్ : కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నేత ముఖ్యమంత్రి అయ్యే ఆ సమయం తప్పకుండా వస్తుందని అన్నారు. మున్ముందు బీసీలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు.కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు దక్కుతుందని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని మహేశ్ గౌడ్ అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవే అని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందన్నారు.ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలకు - మిగతా 2 లో

# లోయలో పడిన ఆర్మీ వాహనం

- 10 మంది సైనికులు మృతి
- జమ్మూకశ్మీర్ లోని దోదా జిల్లాలో ఘోర ప్రమాదం
- 200 అడుగుల లోతులోకి పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం
- గాయపడిన సైనికులు మిలిటరీ ఆసుపత్రికి తరలింపు




2 లో

## ఝార్ఖండ్‌లో
# భారీ ఎన్‌కౌంటర్

- 15 మంది మావోయిస్టులు హతం
- మృతుల్లో సెంట్రల్ కమిటీ సభ్యుడు పతిరామ్ మాంఝీ
- పతిరామ్ మాంఝీపై రూ.5 కోట్లు రివార్డు
- ఝార్ఖండ్‌లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర కాల్పులు
- ఘటనల్లో నక్సలైట్లకు భారీగానే నష్టం కలిగిందని పోలీసులు తెలిపారు
- దాదాపు 665 ఆయుధాలను పోలీసులు స్వాధీనం



ఝార్ఖండ్ : ఝార్ఖండ్‌లో సారండా అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 15 మంది మావోలు మృతి చెందారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు పతిరామ్ మాంఝీ మరణించారు. కాగా, పతిరామ్ మాంఝీపై రూ.5 కోట్లు రివార్డు ఉంది. ఇంకా ఆ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఆపరేషన్ పూర్తి అయిన తర్వాతే వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.చైబాసాలోని కిరీబురు పోలీస్‌స్టేషన్ - మిగతా 2 లో




# పర్యాటకానికి ఏపీ అన్‌లాక్

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- పర్యాటక ప్రాజెక్టుల కోసం ఏపీని అన్‌లాక్ చేశామన్న సీఎం చంద్రబాబు
- ఆతిథ్య రంగంలో పెట్టుబడులపై తమారా లీజర్ సంస్థతో చర్చలు
- విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కాలిబో ఏఐ సంస్థకు పిలుపు
- పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పిస్తున్నట్టు వెల్లడి
- గిరిజన ప్రాంతాల్లో ఎకో టూరిజం ఏర్పాటుకు తమారా సంస్థ ఆసక్తి



అమరావతి : ఏపీలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఇందుకోసం రాష్ట్రాన్ని పూర్తిగా అన్‌లాక్ చేశామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా ఆయన పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి పెట్టుబడులను - మిగతా 2 లో

## ఏపీలో శక్తిమంతమైన
# క్వాంటమ్ కంప్యూటర్

- దావోస్ వేదికగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ప్రపంచవ్యాప్తంగా క్వాంటమ్ నిపుణులకు తీవ్ర కొరత ఉందని వెల్లడించిన మంత్రి లోకేశ్
- అమరావతిని క్వాంటమ్ హబ్‌గా మార్చి, కంప్యూటర్ల తయారీ, ఎగుమతే లక్ష్యమన్న లోకేశ్
- ఏపీలో సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ ఏర్పాటుకు చర్యలు
- ఇంధన పరివర్తన, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఏపీకి డబ్ల్యూఈఎఫ్ సహకారం
- 2024లో 1.3 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ మార్కెట్, 2030 నాటికి 41.8 శాతం వార్షిక సగటు వృద్ధి రేటుతో 20 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా



అమరావతి : క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక ముందడుగు వేయనుందని, 2026 జులై నాటికి దక్షిణాసియాలోనే అత్యంత శక్తివంతమైన క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఆవిష్కరించనున్నామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన పాల్గొన్నారు. “నైపుణ్యాలు, సహకారంతో క్వాంటమ్ ఆవిష్కరణలను వేగవంతం చేయడం“ అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో లోకేశ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్వాంటమ్ కంప్యూటింగ్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగమని తెలిపారు. 2024లో 1.3 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ మార్కెట్, - మిగతా 2 లో

## జనసైనికులకు
# పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

- పార్టీ నేతలకు కీలక సూచన చేసిన పవన్ కల్యాణ్
- ఇతర వ్యక్తుల మధ్య జరిగే వాటిని జనసేనకు ఆపాదించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న పవన్
- వివాహేతర సంబంధాలను కూడా జనసేనపై రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్య
- దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు ఖండించాలని సూచన



అమరావతి : జనసేన పార్టీపై ఎటువంటి దుష్టశక్తుల ప్రభావం పడకుండా జనసైనికులు, వీర మహిళలు, పార్టీ నాయకులు కాపు కాస్తున్నారని... పార్టీ పట్ల వారికున్న నిబద్ధత చాలా గొప్పదని ఏపీ డిప్యూటీ సీఎం ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీకి చెందిన కొందరు కీలక నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ - మిగతా 2 లో

# సంపాదకీయం

## యుద్ధాలతో నశిస్తామా



యుద్ధాలు లేకపోతే, ఉద్రిక్తతలు అంతరిస్తే ప్రపంచం ఎంతో అందంగా మారిపోతుంది, ఆర్థికంగా కళకళలాడుతుంది. ప్రపంచ జీడీపీ ఒక్కసారిగా అయిదు శాతం వరకూ ఎగబాకుతుంది. 2021లో చేసిన ఒక అధ్యయనం ప్రకారం యుద్ధాలు, ఘర్షణలే లేకపోతే కృత్రిమ మేధ (ఏఐ), బయోటెక్నాలజీ, ఇంధన రంగాలు చాలా ఏళ్లక్రితమే మానవాళికి అందుబాటులోకొచ్చేవి. ఆకలి, అనారోగ్యం, దారిద్ర్యం అంతమయ్యేవి. మానవజాతి ఇంకా ఎంతో ప్రగతి సాధించి, ఆనందదాయక ప్రపంచం ఏర్పడి ఉండేది.చరిత్రలో నమోదైన తొలి రాజ్య విస్తరణ యుద్ధం క్రీస్తు పూర్వం 336323 మధ్య జరిగింది. వ్యూహం, ఎత్తుగడల్లో ఆరితేరిన అలెగ్జాండర్ సాగించిన యుద్ధమది. అతడిని గ్రీకువీరుడిగా, జగజ్జేతగా నిలబెట్టడానికి ఆ యుద్ధం తోడ్పడి ఉండొచ్చు గానీ, అందులో మరణించిన సైనికులు, ప్రజల సంఖ్య లక్షల్లో ఉండవచ్చని అంటారు. ఇక దానివల్ల వచ్చిపడిన కరువు కాటకాలు, అంటువ్యాధుల సంగతి చెప్పనవసరం లేదు. ప్రపంచ జనాభా అప్పటికి దాదాపు 10 కోట్లకు మించదు. చాలా సమాజాలు ఈ యుద్ధం తర్వాత నిర్మానుష్యంగా మారడం లేదా బానిసలుగా పరాయి దేశాలకు పోవడం జరిగాయంటే జన నష్టం ఎంతగా జరిగి ఉంటుందో ఊహించుకోవచ్చు. అటుతర్వాత ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేకానేక యుద్ధాలు, వాటి పర్యవసానాలు లక్షలమంది ఉసురుతీశాయి.ఆధునిక ప్రపంచానికి పూర్వదశలో 16181648 మధ్య యూరప్‌లో మూడు దశాబ్దాలపాటు సాగిన నిరంతరాయ యుద్ధాలు దాదాపు 80 లక్షల మందిని బలిగొన్నాయి. ఇందులో ఆ యుద్ధాలు తెచ్చిన కరువు, వ్యాధుల కారణంగా అకాల మరణం చెందినవారు కూడా ఉన్నారు. అప్పటికి ప్రపంచ జనాభా దాదాపు 60 కోట్లు. ఇక ఇరవయ్యో శతాబ్దానికి వస్తే యుద్ధతంత్రం, మారణాయుధాల విన్యాసం కొత్త పోకడలు పోయాయి. మొదటి ప్రపంచయుద్ధ సమయానికి ప్రపంచ జనాభా 200 కోట్లయితే, ఆ యుద్ధంలో దాదాపు 2 కోట్లమంది మరణించారు. రెండో ప్రపంచ యుద్ధం వల్ల సాగిన నరమేధంతోపాటు అది సృష్టించిన కరువు కాటకాలు, విరుచుకుపడిన వ్యాధుల వల్ల మృతి చెందినవారి సంఖ్య 8.5 కోట్లు! ఇది చరిత్రలో నమోదైన అతిపెద్ద ఉత్పాతం. ప్రస్తుతం సాగుతున్న రష్యాఉక్రెయిన్ యుద్ధంలో ఇప్పటికే లక్షలాది మంది మరణించారు. గాజాలో ఇజ్రాయెల్ జన హననం, ఇతరేతర యుద్ధాలు ఈ సంఖ్యను మరిన్ని లక్షలకు పెంచాయి.వరుస యుద్ధాలు, ఘర్షణలు మానవ జీవితాన్ని ఇక్కట్లపాలు చేస్తూ, కోలుకోలేని నష్టాలు కలగజేస్తున్నాయి. సాధించుకున్న అభివృద్ధినంతా నీరుగారుస్తూ దశాబ్దాలూ, శతాబ్దాలూ వెనక్కి తీసుకెళ్తున్నాయి. చరిత్ర నేర్పిన గుణపాఠాలు ఈ పరీక్షా సమయంలో సమష్టితత్వాన్ని బోధిస్తున్నాయి. యుద్ధాల పర్యవసానంగా కలిగే నష్టాలను కనిష్ఠ స్థాయిలో ఉంచాలని, ప్రపంచ పౌరుల రక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరుతున్నాయి. విని, జీవితాలను నిలబెట్టుకోవడమా? విస్మరించి నశించిపోవడమా? అన్నది తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.ధరిత్రి చరిత్రలో ఇంతవరకూ అయిదుసార్లు జీవుల సమూల నిర్మూలనలు (వ్ాఅఅష్ఆఅశీఅం) జరిగాయంటారు. వాటిని 'బిగ్ ఫైవ్'గా పిలుస్తారు. తొలిసారి 44.4 కోట్ల సంవత్సరాల క్రితం, ఆ తర్వాత 36 కోట్ల సంవత్సరాల క్రితం, ఆ తర్వాత 25 కోట్ల సంవత్సరాల క్రితం, దరిమిలా 20 కోట్ల సంవత్సరాల క్రితం, మరలా 6.6 కోట్ల సంవత్సరాల క్రితం డైనోసార్ల వంటి అభివృద్ధి చెందిన జీవులు సమూలంగా అంతరించాయని ఆ సిద్ధాంతం చెబుతోంది. వంద అణు బాంబులు పేలితే ఈ భూ మండలం మొత్తం భస్మీపటలమై మానవజాతి పూర్తిగా అంతరించిపోక తప్పదు. రష్యాఉక్రెయిన్ యుద్ధం క్రమంగా నాటో దేశాలకూ విస్తరించి, అది అణ్వస్త్ర దాడులకు దారి తీసే ప్రమాదం పొంచి ఉంది. రాచరికాలు అంతరించి, జనస్వామ్యాలు అవతరించి వర్ధిల్లుతున్న ఈ యుగంలో సామూహిక హననం వైపు మానవాళి ప్రయాణం సాగిస్తుందా? సమష్టిలోనే తనకు బంగారు భవిత ఉంటుందని గ్రహిస్తుందా? చూద్దాం.

# ఏపీలో శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్

**మొదటిపేజీ తరువాయి** – 2030 నాటికి 41.8 శాతం వార్షిక సగటు వృద్ధి రేటుతో 20 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. అయితే, ఈ రంగానికి అవసరమైన నిపుణుల్లో ప్రపంచవ్యాప్తంగా మూడింట ఒకవంతు మాత్రమే అందుబాటులో ఉన్నారని, ఈ నైపుణ్యాల అంతరాన్ని పూడ్చడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని లోకేశ్ నొక్కిచెప్పారు.ఐబీఎం, టీసీఎస్ భాగస్వామ్యంతో 133-క్విట్ హెరాన్ ప్రాసెసర్‌తో కూడిన ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ 2ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ఇది భారతదేశంలోనే తొలి డెడికేటెడ్ క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌కు కేంద్రంగా ఉంటుందని తెలిపారు. 50 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ ఇన్నోవేషన్ జిల్లాలో అంతర్జాతీయ స్థాయి పరిశోధన కేంద్రాలు, ప్రముఖ కంపెనీలతో కలిసి పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు, 50 వేల మందికి పైగా శిక్షణ అందించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. 2026 జనవరి నాటికి 100 క్వాంటమ్ అల్గోరిథంలను, ఆగస్టు 15 నాటికి 100 క్వాంటమ్ వినియోగ కేసులను పరీక్షించడమే తమ లక్ష్యమని స్పష్టం



చేశారు. అమరావతి నుంచి క్వాంటమ్ కంప్యూటర్లను తయారు చేసి, ప్రపంచానికి ఎగుమతి చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు.క్వాంటమ్ రంగంలో నైపుణ్యాల కొరతను అధిగమించేందుకు ఏపీ ప్రభుత్వం మూడంచెల వ్యూహాన్ని అమలు చేయనుందని లోకేశ్ వివరించారు. తొలి దశలో 10 లక్షల మందికి క్వాంటమ్ అక్షరాస్యత కల్పించడం, రెండో దశలో పరిశ్రమలకు అవసరమైన నిపుణులను తయారు చేయడం, మూడో దశలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా లక్ష మంది డెవలపర్లను సిద్ధం చేస్తామని తెలిపారు. భారత ప్రభుత్వం కూడా 'నేషనల్ క్వాంటమ్ మిషన్' ద్వారా రూ.6,000 కోట్లతో ఈ రంగాన్ని ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు.దావోస్ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్, వరల్డ్ ఎకనమిక్ ఫోరం గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ మరూన్ ఖైరౌజ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏడాదిలోగా ఏపీలో డబ్ల్యూఈఎఫ్-సీ4ఐఆర్ (సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్)ను కార్యాచరణలోకి తీసుకురావడంపై చర్చించారు. ఇంధన పరివర్తన, సైబర్ సెక్యూరిటీ, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై ఈ కేంద్రం దృష్టి సారిస్తుంది. గత ఏడాది నవంబర్‌లో ఏపీ ప్రభుత్వం, డబ్ల్యూఈఎఫ్ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు సాధ్యమైనంత త్వరగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఖైరౌజ్ హామీ ఇచ్చారు. ఈ ప్రయత్నాలన్నీ ఫలించి, చర్చలు వాస్తవ పెట్టుబడులుగా మారాలని ఆశిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# ఝార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**మొదటిపేజీ తరువాయి** – పరిధిలో సారండా అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. సారండా అటవీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్, భద్రతా దళాలు కలిసి మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ చేపట్టాయి. ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో మావోలు కాల్పులు జరిపారు. వెంటనే ప్రతిస్పందించిన భద్రతా బలగాలు మావోలపై భీకర కాల్పులతో విరుచుకుపడ్డారు. ఈ ఘటనల్లో నక్సలైట్లకు భారీగానే నష్టం కలిగిందని పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో సీనియర్ మావోయిస్టు కమాండర్ హతమైనట్లు తెలిసింది. అతనిపై రూ.50 లక్షల రూపాయల రివార్డు ఉందని సమాచారం.గురువారం ఉదయం నుంచి భద్రతా బలగాలు, మావోల మధ్య కాల్పులు జరిగినట్లు కొల్హాన్ డీఐజీ అనురంజన్ తెలిపారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని మరిన్ని వివరాలను ఆపరేషన్ పూర్తి అయిన తర్వాత వెల్లడిస్తామని చెప్పారు. దట్టమైన అడవుల్లో నక్సలైట్లు దాక్కుని ఉన్నారని తెలిపారు. వారిని అంతమొందించడానికి అదనపు బలగాలను కూడా మోహరించినట్లు చెప్పారు.ఝార్ఖండ్‌ను నక్సలైట్ రహిత రాష్ట్రంగా మార్చడానికి అతిపెద్ద అడ్డంకి ఈ సారండా అటవీ ప్రాంతమే. దీనిని ఝార్ఖండ్ నక్సల్ కమాండ్, ప్రస్తుత నిషేధిత సీపీఐ(మావోయిస్ట్) పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బెసరా నాయకత్వం వహిస్తున్నాడు. అతడిపై కూడా రూ.కోటి రివార్డు ఉంది. మిసిర్ బెసరాతో పాటు సెంట్రల్ కమిటీ సభ్యులు అనల్ దా, అసీమ్ మండల్, ఝార్ఖండ్ బిహార్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు సుశాంత్ సహా 60 మంది నక్సలైట్లు ఉన్నారు. వారందరూ కొల్హాన్‌లో క్యాంపింగ్ చేస్తున్నారు. అదనంగా, 20 నుంచి 25 మంది నక్సలైట్ల బృందం నక్సలైట్ కమాండర్ అజయ్ మహతో కోసం పనిచేస్తోంది. వీళ్లు పశ్చిమ సింహ్‌భూమ్‌లో కూడా క్యాంపింగ్ చేస్తోంది.జనవరి 3న ఛత్తీస్‌గఢ్‌లో రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ ఘటనలో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు. సుక్మా జిల్లాలో 12 మందికి పైగా మావోయిస్టులు హతమవగా, బీజాపూర్ జిల్లాలో ఇద్దరిని పోలీసులు మట్టుబెట్టారు. ఈ ఎదురుకాల్పుల్లో కుంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు మృతి చెందారు. గత నెలలో బీజాపూర్‌లో కూడా మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య భారీగా ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇద్దరు జవాన్లు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఘటనాస్థలం నుంచి మావోయిస్టుల మృతదేహాలతో పాటు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.గతేడాది జనవరి నుంచి డిసెంబర్ మధ్య బస్తర్ డివిజన్‌లోని వివిధ జిల్లాల జరిగిన ఎన్‌కౌంటర్లలో దాదాపు 256 మంది మావోలు మృతి చెందినట్లు తెలుస్తోంది. దాదాపు 665 ఆయుధాలను పోలీసులు



స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఏకే 47, ఎల్‌ఎంజీ, ఐఎన్‌ఎస్‌ఏఎస్, ఎస్‌ఎల్‌ఆర్ వంటి ఆటోమెటిక్ ఆయుధాలు ఉన్నాయి. వీటితో పాటు అదనంగా 303 భర్మార్లు, బీజీఎల్ లాంచర్లు, సింగిల్ షాట్ రైఫిల్స్, కార్బైన్‌లతో సహా వివిధ రకాల ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే వీటిలో కొన్నింటిని ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి స్వాధీనం చేసుకోగా, మరికొన్నింటిని అడవి ప్రాంతం నుంచి పునరావాసం పొందిన మావోయిస్టుల నుంచి తీసుకున్నారు.

# మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జాతర సమయంలో వేగంగా గమ్యస్థానం చేరుకునేందుకు వీలుగా హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ పర్యాటక శాఖ, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా అందిస్తున్న ఈ సేవలు ప్రారంభమయ్యాయి.భక్తుల అవసరాలకు అనుగుణంగా రెండు రకాల ప్యాకేజీలను నిర్వాహకులు ప్రకటించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి నేరుగా మేడారం వెళ్లి, తిరిగి వచ్చేందుకు అవకాశం కల్పించారు. ఈ రౌండ్ ట్రిప్‌కు ఒక్కో వ్యక్తికి ఛార్జీ రూ. 35, 999గా నిర్ణయించారు. అయితే, జనవరి 23లోపు బుక్ చేసుకున్న వారికి రాయితీ అందిస్తుండగా, వారు రూ. 30,999 చెల్లిస్తే సరిపోతుంది.ఇక, రెండో ప్యాకేజీ కింద మేడారం జాతర అందాలను ఆకాశం నుంచి వీక్షించాలనుకునే వారి కోసం 'జాయ్ రైడ్స్' నిర్వహిస్తున్నారు. మేడారం సమీపంలోని పడిగాపూర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి ఈ సర్వీసులు నడుస్తాయి. సుమారు 6 నుంచి 7 నిమిషాల పాటు సాగే ఈ గగన విహారానికి ఒక్కొక్కరికి రూ. 4,800 రుసుముగా వసూలు చేయనున్నారు. ఈ సేవలతో భక్తులు సమయం ఆదా చేసుకోవడంతో పాటు జాతరను విహంగ వీక్షణం చేసే అద్భుత అవకాశం పొందవచ్చు.




# పర్యాటకానికి ఏపీ అన్‌లాక్

**మొదటిపేజీ తరువాయి** – ఆకర్షించే లక్ష్యంతో పర్యాటకం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాలపై ప్రధానంగా దృష్టి సారించారు.సదస్సులో భాగంగా తమారా లీజర్ సీఈఓ సృష్టి శిబులాల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఆతిథ్య రంగంలో పెట్టుబడి అవకాశాలను ఆమెకు వివరించారు. పర్యాటక ప్రాజెక్టులకు ఇప్పటికే పారిశ్రామిక హోదా కల్పించామని, పెట్టుబడిదారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. పోలవరం నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో, అలాగే కోనసీమ, గండికోట, అరకు, లంబసింగి వంటి ప్రాంతాల్లో టూరిజం ప్రాజెక్టులు అభివృద్ధి చేయడానికి అపార అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. దీనిపై స్పందించిన తమారా ప్రతినిధులు, గిరిజన ప్రాంతాల్లో ఎకో టూరిజం పార్కులు, విశాఖ వంటి నగరాల్లో హోమ్ స్టే ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆసక్తిగా ఉన్నామని తెలిపారు.మరోవైపు కాలిబో ఏఐ అకాడెమీ వ్యవస్థాపకులు రాజ్ వట్టికూటితోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఇప్పటికే అమరావతిలోని ఓ ప్రైవేట్ విశ్వవిద్యాలయంలో తమ సంస్థ యువతకు ఏఐలో శిక్షణనిస్తోందని కాలిబో ప్రతినిధులు సీఎంకు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాలకు కూడా విస్తరించాలని చంద్రబాబు సూచించారు. విశాఖపట్నంలోని మధురవాడ ఐటీ సెజ్‌లో ఒక "సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్" కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కాలిబో ఏఐ సంస్థను ఆయన ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రి టీజీ భరత్ కూడా పాల్గొన్నారు.

# జనసైనికులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

**మొదటిపేజీ తరువాయి** – సందర్భంగా.. సంస్థాగత అంశాలపై నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో వ్యక్తుల మధ్య జరిగే ఘర్షణలు, ఆర్థిక లావాదేవీలు, మానసిక బలహీనతలు, వ్యక్తిగత కుల విభేదాలను జనసేన పార్టీకి ఆపాదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కిరాయి వక్తలు, కిరాయి మాధ్యమాలు కలిసి పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ప్రత్యేకంగా వివాహేతర సంబంధాలు వంటి వ్యక్తిగత అంశాలను కూడా జనసేనపై రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని పవన్ పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ విధమైన నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించాలని సూచించారు.

# లోయలో పడిన ఆర్మీ వాహనం



**మొదటిపేజీ తరువాయి** – జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇండియన్ ఆర్మీకి చెందిన వాహనం లోయలో పడిపోయింది. చంబా-బందేర్వా హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా... పలువురు గాయపడ్డారు.ఆర్మీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో ప్రమాదం సంభవించింది. లోయలో సుమారు 200 అడుగుల లోతులోకి వాహనం పడిపోయింది. హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆర్మీతో పాటు పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడినవారిని ఉదంపూర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించారు.

## దావోస్ వేదికగా రేవంత్ రెడ్డి , నారా లోకేశ్ భేటీ



**మొదటిపేజీ తరువాయి** – 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కోసం తీసుకుంటున్న చర్యలు, వాటి ద్వారా వస్తున్న సానుకూల ఫలితాల గురించి చర్చించారు.దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి, తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలిపారు. ముఖ్యంగా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా టాటా సంస్థ సహకారంతో తెలంగాణలోని ఐటీఐలను ఆధునిక స్కిల్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దామని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ క్యాంపస్‌లను సందర్శించి, అక్కడ అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించాలని లోకేశ్ ను ఆయన ఆహ్వానించారు.అలాగే, కోట్లాది మంది భక్తులు దర్శించుకునే మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానాన్ని వందల కోట్ల రూపాయలతో ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చూపని చొరవతో రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, తప్పకుండా వనదేవతలను దర్శించుకోవాలని లోకేష్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.పెట్టుబడుల సాధనలో తెలుగు రాష్ట్రాలు పరస్పరం పోటీపడుతూనే, అభివృద్ధి విషయంలో సహకరించుకోవాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తితో ముందుకెళితే దేశానికే తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో బీసీ నేత సీఎం అయ్యే సమయం వస్తుంది



**మొదటిపేజీ తరువాయి** – ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం దేశానికి మంచిది కాదని, కులం, మతం పేరుతో మన పిల్లలకు భవిష్యత్తు రాదని వ్యాఖ్యానించారు. రాముడు, అంజనేయుడి పేర్లు చెప్పి బీజేపీ నేతలు ఓట్లు దండుకుంటున్నారని విమర్శించారు.అర్వింద్ 'జై శ్రీరాం' అని కాకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి ఓట్లు అడగాలని హితవు పలికారు. రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం చేశారో వివరించాలన్నారు. దేవుళ్లను రాజకీయాలతో ముడిపెట్టవద్దని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# మూసీ ప్రక్షాళన.. క్రీడా వసతులు

**తెలంగాణకు టాటా గ్రూప్ అండ**

**దావోస్‌లో టాటా గ్రూప్‌తో పలు కీలక ప్రాజెక్టులకు తెలంగాణ ఒప్పందం**

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగస్వామి కానున్న టాటా**

**హైదరాబాద్ క్రీడా మైదానాల అభివృద్ధికి టాటా చేయూత**

**పుణ్యక్షేత్రాల్లో హోటళ్ల నిర్మాణానికి టాటా ఆసక్తి**

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వం భారీగా పెట్టుబడులను రాబట్టింది.




సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం జరిపిన చర్చల ఫలితంగా రాష్ట్రంలో పలు కీలక ప్రాజెక్టులలో భాగస్వామి అయ్యేందుకు టాటా గ్రూప్ ముందుకొచ్చింది. దావోస్‌లో ముఖ్యమంత్రి, టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో జరిపిన భేటీలో ఈ మేరకు కీలక ఒప్పందాలు కుదిరాయి.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు'లో భాగస్వామి కావడానికి టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. రాజస్థాన్, మహారాష్ట్రలలో నీటి వనరుల పునరుద్ధరణలో తమకున్న అనుభవాన్ని ఈ ప్రాజెక్టుకు ఉపయోగిస్తామని చంద్రశేఖరన్ తెలిపారు. కేవలం నదిని శుభ్రపరచడమే కాకుండా, మూసీ పరీవాహక ప్రాంతాన్ని ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా మార్చడంలో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.దీంతో పాటు హైదరాబాద్‌లోని క్రీడా మైదానాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు టాటా గ్రూప్ చేయూత అందించనుంది. 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' ఏర్పాటు, 2036 ఒలింపిక్స్‌ను లక్ష్యంగా చేసుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనలోనూ సహకరిస్తామని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. అలాగే భద్రాచలం, మేడారం, వేములవాడ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, రిసార్టులు నిర్మించేందుకు కూడా టాటా గ్రూప్ ఆసక్తి చూపింది. ఈ ఒప్పందాలు రాష్ట్ర అభివృద్ధిలో మైలురాయిగా నిలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**పేదలు,నిరుపేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో గ్రామ సర్పంచ్, గ్రామ శాఖ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు**



**ఎల్కతుర్తి జనవరి 22 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలం జీలుగుల గ్రామంలో గ్రామ సర్పంచ్ ఘనబోయిన సృజన రాజు యాదవ్ అధ్యక్షతన గురువారం గ్రామానికి చెందిన తంగేళ్ల సారయ్య కు అత్యవసర చికిత్స కోసం సీఎం సహాయనిది మంజూరైన 39వేల రూపాయల చెక్కును లబ్ధిదారునికి విలువైన చెక్కును గ్రామ శాఖ అధ్యక్షుడు తౌటం నరేందర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారునికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పేదలు, నిరుపేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల కష్టాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తున్నామని మండలంలోని అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఘనబోయిన సృజన రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తౌటం నరేందర్,మాజీ సర్పంచులు గూటం జోగిరెడ్డి,రావుల రమేష్, మాజీ ఉపసర్పంచ్ ముచ్చ బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రావుల లక్ష్మణ్, రావుల వీరయ్య,కుక్కల ఓదెలు, ఆరేపల్లి ప్రభాకర్, ఘనబోయిన తిరుపతి, స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వర్తించాలి

**జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



**జగిత్యాల జనవరి 22(ప్రజా మంటలు) :** జిల్లా ఐ డి ఓ సి మీటింగ్ హాల్ లో నిర్వహించిన మున్సిపల్ ఆర్వోలు, ఏఆర్ఓలకు నిర్వహించినఎలక్షన్ ట్రైనింగ్ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఇందులో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఆర్వో, ఏఆర్వో లకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలకమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు.ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో ఎన్నికల నిబంధనలు అనుసరించి నిర్వహించాలనే బాధ్యత ఆర్వో, ఏఆర్వో పైన ఉందని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల విధులు చాలా కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణం గా అవగాహన కల్పించుకొని విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, పూర్తి సామాగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, బ్యాలెట్ బాక్స్ ఎలా సీల్ చేయాలి, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పి ఓ డైరీ నింపడం, అన్ని ఫార్మ్స్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బ్యాక్ సీలింగ్, ఓట్స్ కౌంటింగ్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహణ, చైర్మన్, వైస్ చైర్మన్ నియామక పత్రాలు ఇవ్వడం తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్వో, ఏఆర్వో ల కార్యాచరణ, విధులు, బాధ్యత లు తీసుకోవలిసిన జాగ్రత్త లను పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్స్ వివరించారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు సమన్వయం చేసుకొని అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్,కోరుట్ల మెట్పల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మాస్టర్ ట్రైనర్స్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

**అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్. లత**



**జగిత్యాల జనవరి 22(ప్రజా మంటలు) :** జిల్లాలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత కలెక్టరేట్ లోన గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని అదనపు కలెక్టర్ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి జాతీయ పతాక ఆవిష్కరణ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. గణతంత్ర వేడుకల డయాస్ , సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు. వైద్య బృందాలచే శిభిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలనుద్దేశించి చేసే ప్రగతి సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా అందజేయాలని అన్నారు.గణతంత్ర వేడుకల అవసరమైన మేర త్రాగు నీటి ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.గణతంత్ర దినోత్సవ వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం పాఠశాల విద్యార్థులను తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ విద్యాశాఖ అధికారికి సూచించారు. వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేసే విధంగా డిఆర్డిఓ సమన్వయం చేసుకోవాలని తెలిపారు. గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు స్థానిక ఆర్డిఓ ఆర్డీవో,తాసిల్దార్ మరియు మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జగిత్యాల రెవిన్యూ డివిజనల్ అధికారి మధు సుధన్, కలెక్టరేట్ పరిపాలన అధికారి, డి ఆర్ డి ఓ రఘువరన్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు ఇక్రిసాట్ కాలనీలో డ్రైనేజీ పనులకు మోక్షం

**రూ.15 లక్షలతో అండర్గ్రౌండ్ పైపులైన్ పనులు ప్రారంభం**



**సికింద్రాబాద్, జనవరి 22 ( ప్రజామంటలు) :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని ఇక్రిసాట్ కాలనీలో కంటోన్మెంట్ బోర్డు నిధులు రూ. 15 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులను నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గతంలో తాను వైస్ ప్రెసిడెంట్గా ఉన్న సమయంలో కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ పైపులైన్ సామర్థ్యం తక్కువగా ఉండటంతో తరచూ ఓవర్ఫ్లో అవుతూ మురికినీరు సక్రమంగా వెళ్లక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.డ్రైనేజీ సమస్యపై పోలీస్ డీజీపీ చారుసిన్హా ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని కంటోన్మెంట్ సీఈఓ దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు వెంటనే స్పందించి వర్క్ ఆర్డర్ జారీ చేయడంతో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.కంటోన్మెంట్ విషయంలో ఎన్నికలైనా లేదా విలీనమైనా తుది నిర్ణయం వచ్చే వరకు అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోకుండా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. విలీనం పేరుతో ధర్నాలు చేపడితే అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్కు రావాల్సిన టీపీటీ బకాయిలను విడుదల చేయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిధులు సమీకరించి అందరూ కలసి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, నిరహారదీక్ష సభాస్థలంలో చేసిన వ్యాఖ్యలు విచారకరమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని సూచించారు. ఇక్రిసాట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమేశ్వర రావు, కార్యదర్శి శివకాంత్ గౌడ్, నర్సింగరావు, భాస్కర్, బీజేపీ 6వ వార్డు అధ్యక్షుడు ప్రతిక్ జైన్, బాణాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేవెన్యూ అధికారికి ఐఏఎస్ హోదా



**హనుమకొండ జనవరి 22 (ప్రజా మంటలు) :** జిల్లా రేవెన్యూ అధికారి వై.వి. గణేష్ కు ఐఏఎస్ హోదా వచ్చిన సందర్భంగా హనుమకొండ జిల్లా సదాశివ ఫౌండేషన్ నేతృత్వంలో నేత్ర అవయవ దాతల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఏఎస్ హోదా పత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధితో పాటు ప్రజాసేవలో గణేష్ మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.ఎల్కతుర్థ్నీ హై స్కూల్లో సీఎం కప్ గ్రామీణ స్థాయి క్రీడల ప్రారంభం ఎల్కతుర్తి జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహిస్తున్న సీఎం కప్ గ్రామీణ స్థాయి క్రీడలను గ్రామ సర్పంచ్ మునిగడప లావణ్య శేషగిరి , ఎంపీడీవో విజయ్ కుమార్ ,ఉపసర్పంచ్ గోడిశాల రాజు గౌడ్ వార్డ్ నెంబర్ లు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ క్రీడలను ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.గ్రామీణ ప్రాంత యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సర్పంచ్ సూచించారు. సీఎం కప్ వంటి పోటీలు గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సత్యనారాయణ, ప్రధానోపా ధ్యాయురాలు దుర్గాబాయి,వార్డ్ మెంబర్లు అంభాల స్వరూప, మాటూరి వసంత , శనిగరపు స్వరూప,అంబాల ప్రత్యూష, నాంపల్లి మమత, కొత్తకొండ అజయ్, జన్నారపు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ , పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రైకల్ మున్సిపల్ ను అభివృద్ధి చేసిన ఘనత కెసిఆర్ దే

# జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత



**రాయికల్ జనవరి 22 ( ప్రజా మంటలు) :** పట్టణం లో.బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశం లో పాల్గొన్న జిల్లా తొలి జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీగా ఉన్న రాయికల్ ను మున్సిపల్ గా మార్చి 25 కోట్లతో ప్రతి వార్డులో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ దే అని అన్నారు.రాయికల్ పట్టణంలో జరిగిన ప్రతి పని కేసీఆర్ ఉన్నపుడు జరిగిన అభివృద్ధి తప్ప ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా జరిగిన అభివృద్ధి ఏమి లేదు అని అన్నారు.రాయికల్ ను మున్సిపల్ గా చేసి మొదటిసారి రాయికల్ మున్సిపల్ లో గులాబీ జెండా ఎగరవేశం, బి ఆర్ ఎస్ పార్టీ చేసిన అభివృద్ధితో మళ్ళీ రాయికల్ పట్టణంలో గులాబీ జెండా ఎగరేవేస్తామని అన్నారు.రాయకల్ పట్టణంలో బిఆర్ఎస్ హయాంలో నీరు పేదలకు 60 డబల్ బెడ్ రూమ్ లు కేసీఆర్ మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అక్కడి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. అభివృద్ధి కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే రాయకల్ నుండి మైథాపూర్ బ్రిడ్జి మరియు ఇటిక్యాల్ బ్రిడ్జి ఎందుకు పూర్తి చేయలేకపోయారు అని ప్రశ్నించారు...? కార్యకర్తల కష్టం మీద గెలిచిన నువ్వు సొంత అభివృద్ధి కోసం పార్టీ మారారూ అని అన్నారు.పొలాలు నాటు వేసే సమయం కూడా అయిపోయిందని ఇంకా రైతు భరోసా కింద డబ్బులు ఎందుకు జమ కాలేదని అని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు నిండా ప్రతి మహిళకు 2500 రూపాయలు ఇస్తానన్నారు ఎప్పుడు ఇస్తారు...2000 నుంచి 4000 చేస్తా అన్న పెన్షన్లు ఎప్పుడు పెంచుతారు.మిషన్ భగీరథ కింద చెరువుల పూడిక తీసి చెరువులో చాప పిల్లలు వేసి గంగపుత్రుల జీవితాల్లో వెలుగు నింపిన ఘనత కేసిఆర్ ని అన్నారు.రాయికల్ పట్టణంలో అనువణువులో కేసీఆర్ గారు చేసిన అభివృద్ధి కనిపిస్తుందని అన్నారు.రాయికల్ మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి తప్ప ఏ పార్టీకి కూడా ఓట్లు అడిగి అర్హత లేదని అన్నారు.ప్రభుత్వంతో కలిసి పని చేస్తా అన్న ఎమ్మెల్యే గాంధీ భవానికి ఎందుకు వెళ్లావు అని అన్నారు.కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం లేని మీకు గాంధీభవన్లో ఏం పని అన్నారు.ఎలక్షన్ టైం లో ప్రజల దృష్టి మళ్లించేందుకు బి ఆర్ ఎస్ నాయకులకు కక్షపూరితంగా నోటీసులు ఇచ్చి డైవర్షన్ పాలిటిక్స్ రేవంత్ రెడ్డి చేస్తున్నాడు అని అన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారు తప్పకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్ వైస్ ప్రెసిడెంట్ వాసం రాజేందర్ కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదయశ్రీ లింగన్న మండల అధ్యక్షుడు బర్కాం మల్లేష్ మాజీ కౌన్సిలర్ లు శ్రీరాములు సత్య నారాయణ మహేష్ గౌడ్ మహేందర్ మాజీ కో ఆప్షన్ వనిత గణేష్ సోహెల్ బి.ఆర్.ఎస్ నాయకులు బాబా ప్రశాంత్ రావు లింగన్న తదితరులు ఉన్నారు.

# ముల్కనూర్ సమ్మక్క సారక్క ఆలయ చైర్మన్‌గా జక్కుల ఐలయ్య



**భీమదేవరపల్లి జనవరి 22 (ప్రజా మంటలు) :** సమ్మక్క సారలమ్మ ఆలయం చైర్మన్‌గా జక్కుల ఐలయ్యను నియమిస్తూ దేవదాయ ధర్మదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియమించిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే సమ్మక్క సారక్క జాతరకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా భద్రత, త్రాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వసతుల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ డైరెక్టర్లుగా గీకురు ఐలయ్య, మాడుగుల యాదగిరి, గుడి కందుల రాజు, పెంచికల జైపాల్, వంగ శ్రీనివాస్ గౌడ్, కుదురుపాక శ్రీనివాస్, పెంట పూర్తి వీరారెడ్డి, మారుపాటి శ్రీనివాస్ రెడ్డి, మద్ది వేణుగోపాల్, మాలోతు మొగిలి, చిదురాల విజయ రెడ్డి, ఎలుకపల్లి రామారావు, మాడుగుల మధుకర్‌లను నియమించారు.

## వీరభద్ర భద్రకాళి ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు

**రాష్ట్ర బిజెపి నాయకులు ఇనుగాల పెద్దిరెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు**



**భీమదేవరపల్లి జనవరి 22 (ప్రజా మంటలు) :** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీ కొత్త కొండ వీరభద్ర స్వామి జాతరను ఇనుగాల పెద్దిరెడ్డి సునంద దేవి గురువారం దర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో కోడె మొక్కులు, గుమ్మడి కాయ, కోరమీసము సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, అమ్మవారికి మార్చి (అలంకరణ) నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.పూజానంతరం దేవస్థానం తరఫున శేషవస్త్రం, స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఘనంగా ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమానికి ఆలయ ఈవో పి. కిషన్ రావు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, వచ్చిన భక్తులను ఘనంగా స్వాగతించారు.

## ఆదర్శ పాఠశాల లో ఆర్ బి ఎస్ కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు



**గొల్లపల్లి జనవరి 22 ప్రజా మంటలు :** ధర్మారం ఆదర్శ పాఠశాల లో విద్యార్థిని విద్యార్థులందరికీ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు.ఆదర్శ పాఠశాలలో సమగ్రమైన పిల్లల ఆరోగ్య కార్యక్రమ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ బాల బాలికలకు తరగతి కి అనుగుణంగా పలు రకాల కంటి పరీక్షలు నిర్వహించారు.ఇందులో భాగంగా విద్యార్థులందరికీ హెల్త్ అండ్ హైజీన్ గురించి వివరిస్తూ విద్యార్థులకు అవసరమగు కంటి కి సంబంధించిన ప్రైమరీ పరీక్షలు నిర్వహించి కంటి సంరక్షణ పద్ధతులను తెలుపుతూ అవసరమగు విద్యార్థులకు కళ్ళజోడు ఇవ్వటం జరుగుతుంది అని ప్రిన్సిపల్ వివరించారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్,ఆర్ బిఎస్ కే హెల్త్ డిపార్ట్మెంట్ డాక్టర్స్ మల్లేష్, అజయ్ కుమార్,ఏఎన్ఎం సఫియా, ఫార్మాసిస్ట్ మమత విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై విద్యార్థినులకు పోలీస్ జాగృతి అవగాహన

**చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : వంగర ఎస్ఐ దివ్య**



**భీమదేవరపల్లి, జనవరి 22 (ప్రజా మంటలు) :** వంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని డా. పీవీఆర్ ఆర్ ఆర్ టీజీఆర్ స్కూల్ & గర్ల్స్ జూనియర్ కాలేజ్‌లో పోలీస్ జాగృతి కళా బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా వంగర ఎస్ఐ దివ్య మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి పెట్టాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల కోసం హెల్ప్‌లైన్ 1930 కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక అంశాలపై కళా బృందం పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్, కళా బృందం ఇంచార్జి ఉమెన్ ఏఎస్ఐ శ్రీమతి నాగమణి, సభ్యులు హెడ్ కానిస్టేబుల్స్ విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, పీసీ పూల్ సింగ్, హోమ్ గార్డులు, గర్ల్స్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానికులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

**బీజేపీ మండల అధ్యక్షులు మంతూర్తి శ్రీకాంత్ యాదవ్ డిమాండ్**



**ఎల్కతుర్తి జనవరి 22 ప్రజా మంటలు :** మండలంలోని సూరారం శివారులో ఏర్పాటు చేస్తున్న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌లో స్థానిక యువతి యువకులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షులు మంతూర్తి శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు.గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలో రిలయన్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ స్థాపించడం హర్షణీయమైన విషయమేనని అన్నారు. అయితే ఉపాధి అవకాశాలు లేక ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న స్థానిక యువతను విస్మరించకూడదని స్పష్టం చేశారు. వారి విద్యార్హతలు నైపుణ్యాలను బట్టి ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత కంపెనీ యాజమాన్యంపై ఉందని పేర్కొన్నారు.అలాగే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ కూడా ఈ విషయంలో చొరవ తీసుకొని కంపెనీ యాజమాన్యంతో చర్చించి స్థానిక మండలానికి చెందిన యువతి యువకులకే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు కల్పించేలా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే పరిశ్రమల స్థాపనకు ప్రజల మద్దతు మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల సీనియర్ నాయకులు మండల మోర్చా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ క్యాలెండర్ ఆవిష్కరించిన సిఐ పులి రమేష్ ఎస్సై ప్రవీణ్ కుమార్ వంగర ఎస్సై గోలిపెల్లి దివ్య



**ఎల్కతుర్తి జనవరి 22 ప్రజా మంటలు :** ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల పక్షాన నిలబడి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లడంలో ఎల్కతుర్తి పాత్రికేయుల పాత్ర ముందు వరసలో ఉండాలని స్థానిక ఎస్సై ఆకిన పెల్లి ప్రవీణ్ అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ను ఆవిష్కరించిన అనంతరం సీఐ పులి రమేష్ ఎస్ఐ ఏ ప్రవీణ్ కుమార్ వంగర ఎస్సైగోలిపెల్లి దివ్య మాట్లాడుతూ పత్రికలు సమాజానికి ముఖ్య భూమిక పోషిస్తున్నాయని ప్రజలకు ప్రభుత్వాలకు ఒక వారధిలా నిలుస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమం లో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు కందుకూరి రాజన్న అధ్యక్షులు సాతురి చంద్రమౌళి,ఉపాధ్యక్షులు రామోజీ సతీష్ చారి, ఉపాధ్యక్షులు డా " ఉదయ చందర్,ప్రచార కార్యదర్శి రాజిరెడ్డి, కోశాధికారి కందుకూరి మహేష్ చారి,కార్యవర్గ సభ్యులు బొంకూరి వంశీ ఆర్టీసీ డ్రైవర్ గుడెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

## కోల్పోయిన మొబైల్ యజమానికి అప్పగింత




**భీమదేవరపల్లి జనవరి 22 (ప్రజా మంటలు) :** మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం కోల్పోయిన మొబైల్ ఫోన్‌ను పోలీసులు గుర్తించి యజమానికి అప్పగించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు సాంకేతిక పరిజ్ఞానంతో ట్రేస్ చేసి, ఎం.డి. జసీమ్‌కు చెందిన మొబైల్‌ను అధికారిక ప్రక్రియల అనంతరం సురక్షితంగా అందజేశారు. మొబైల్ తిరిగి లభించడంతో జసీం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ, ఆంధ్ర జలవివాదం

**నీటి కేటాయింపులపై ఏపీపై ఒత్తిడి తెచ్చేలా ఇరిగేషన్ అధికారుల యోచన**

**నీటి కేటాయింపులకు ఏపీ కట్టుబడి ఉండేలా ఒత్తిడి తేవాలని నిర్ణయం**

**రెండు రాష్ట్రాలకు మధ్య జలవనరుల అంశాలపై ఈనెల 30న సమావేశం**

**పునర్విభజనకు ముందు ఇచ్చిన కేటాయింపులపై తొలుత అంగీకరించేలా ఒత్తిడి**



రాష్ట్ర నీటిహక్కుల విషయంపై ఆంధ్రప్రదేశ్‌పై ఒత్తిడి తెచ్చేలా చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులు భావిస్తున్నారు. పునర్విభజనకు ముందు చేపట్టిన ప్రాజెక్టుల నీటి కేటాయింపుల కోసం ఏపీ ఒప్పించేలా చర్చించాలని నిర్ణయించారు. ఆ మేరకు ఈనెల 30న కేంద్రం వద్ద జరిగే సమావేశంలో వినిపించాల్సిన వాదనపై నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తోంది.పునర్విభజనకు ముందు తెలంగాణలోనిప్రాజెక్టులకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన నీటి కేటాయింపులకు ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉండేలా ఒత్తిడి తేవాలని నీటిపారుదల శాఖ కసరత్తు ప్రారంభించింది. పునర్విభజన తర్వాత రాష్ట్రంలో పెరిగిన సామర్థ్యం మేరకు నీటికేటాయింపులని ట్రైబ్యునల్ నిర్ణయిస్తుందని, పునర్విభజనకు ముందు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన నీటి కేటాయింపులకి ఏపీ అంగీకారం తెలిపేలా ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్లు తెలిసింది.రెండు రాష్ట్రాలకు మధ్య జలవనరులకు సంబంధించిన అంశాలపై కేంద్ర జలసంఘం ఛైర్మన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ మొదటి సమావేశం ఈ నెల 30న జరగనుంది. ఆ సమావేశం ఎజెండా ఖరారుకే పరిమితమయ్యే అవకాశం ఉన్నా పునర్విభజనకు ముందు జీవోలు ఇచ్చి చేసిన కేటాయింపులపైనే మొదట ఓఅంగీకారానికి రాగలిగితే పాలమూరు-రంగారెడ్డితో సహాకృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవచ్చనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి.ఏపీ పునర్విభజనకు ముందు కల్వకుర్తిని 25, నెట్టెంపాడు 22, ఎస్ఎల్‌బీసీ 3, కోయిల్‌సాగర్‌ని 3.9 టీఎంసీలతో చేపట్టారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జూరాలనుంచి నీటిని తీసుకొనేలా 70 టీఎంసీలతో, కొడంగల్ఎత్తిపోతలను 7.1, డిండి ఎత్తిపోతలను 30 టీఎంసీలతో చేపట్టేందుకు పునర్విభజనకు ముందే అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పునర్విభజనకు ముందు పనులు చేపట్టిన ఉత్తర్వులిచ్చిన ప్రాజెక్టుల సామర్థ్యం 188 టీఎంసీలుంటే ఆ తర్వాత వాటి సామర్థ్యం304 టీఎంసీల వరకు పెరిగింది.మొదట 188 టీఎంసీలపై ఆంధ్రప్రదేశ్ సానుకూలత వ్యక్తంచేస్తే ఆతర్వాత పెరిగిన సామర్థ్యం మేరకు కేటాయింపుల గురించి ట్రైబ్యునల్‌లో తేల్చుకోవచ్చని నీటిపారుదలశాఖవర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద జరిగిన సమావేశంలో ఇదే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బీసీ మినహా మిగిలిన ప్రాజెక్టుల ఇన్వెస్టిగేషన్‌కి మాత్రమే అప్పట్లో జీవోలిచ్చారని ఏపీ పేర్కొంది. ఆ ప్రకారం 81 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులే ఉంటాయి. అందులో కోయిల్‌సాగర్‌కు బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపులున్నందున 77 టీఎంసీల గురించే ఆంధ్రప్రదేశ్ మాట్లాడుతోందని నీటిపారుదల శాఖవర్గాలు వివరిస్తున్నాయి. ఐతే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రధాన లక్ష్యంగా ఒత్తిడి చేయాలనే ఆలోచనతో తెలంగాణ ఉన్నట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో హంద్రీనీవా, గాలేరు-నగరి, వెలిగొండ, తెలుగుగంగ ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు. వాటి సామర్థ్యం 150.5 టీఎంసీలు. తెలుగుగంగకు బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ 25 టీఎంసీలు కేటాయించినా, ఆ తీర్పు అమల్లోకి రాలేదు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల వాదనలు వింటున్న ట్రైబ్యునల్ ముందు ఆ అంశం ఉంది. పునర్విభజనచట్టం ప్రకారం నిర్మాణంలో ఉండి పూర్తి చేయాల్సిన ప్రాజెక్టుల్లో కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్ఎల్‌బీసీ, హంద్రీనీవా, గాలేరు-నగరి, వెలిగొండ, తెలుగుగంగ ఉన్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల, కొడంగల్ సహా కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టుల విషయంలో ఆంధ్రప్రదేశ్ సానుకూలంగా స్పందిస్తేనే మిగిలిన అంశాలపై చర్చల గురించి ఆలోచించాలనే అభిప్రాయంతో రాష్ట్రప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నీళ్ల సమస్యల విషయంలో తాము వివాదాలు కోరుకోవడం లేదని పరిష్కారం కోరుకుంటున్నామన్నారు. రాజకీయ ప్రయోజనాలు కాదు ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నామని ఆయన వివరించారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పొరుగు రాష్ట్రం సహకారం ఉండాలని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రెండు రాష్ట్రాలు(ఏపీ, తెలంగాణ) పరస్పరం సహకరించుకున్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అశాభావం వ్యక్తం చేశారు.

# ఆనందాలకు అడ్డుగా ఉన్నాడని భర్త హత్య

**తానే చేసినట్లు ఒప్పుకున్న భార్య**

**చున్నీ గొంతుకు బిగించి హత్య చేసిన భార్య**

**మంచంకోడు తగిలి చనిపోయాడని నమ్మించే ప్రయత్నం**

**భార్య ప్రవర్తనపై అనుమానంతో పోలీసులకు బంధువుల ఫిర్యాదు - విచారణలో వెలుగు చూసిన అసలు నిజం**



రెండు దశాబ్దాల దాంపత్య జీవితం పిల్లల భవిష్యత్ కోసం పల్లె వదిలి పట్నం వచ్చారు. 20 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. అలకలు, కొట్లాటలు షరా మామూలే. జీవితం ముందుకు సాగుతున్న కొద్దీ బంధం బలపడుతుంది. కానీ వారి వైవాహిక జీవితానికి బీటలు వారడానికి కారణం ఏంటి? భార్యపై భయంతో ఆ భర్త పోలీసులను ఎందుకు ఆశ్రయించాడు? ఇంతకీ అతను ఊహించినట్లే జరిగిందా? ఏలూరు జిల్లా నూజివీడు సమీపంలోని తూర్పుదిగవల్లికి చెందిన జగ్గవరపు సుధీర్‌రెడ్డికి అదే ప్రాంతానికి చెందిన బ్రహ్మజ్ఞానప్రసన్నతో 20 ఏళ్ల క్రితమే వివాహమైంది. ఉపాధి కోసం హైదరాబాద్ వచ్చిన ఈ దంపతులు కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో ఓ ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుధీర్‌రెడ్డి ఓ ప్రైవేట్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. పల్లెటూరు నుంచి పట్నం వచ్చిన తర్వాత ప్రసన్న జల్సాలకు అలవాటుపడింది. ఈ వ్యవహారం భర్త సుధీర్‌రెడ్డికి నచ్చకపోవడంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. అలాగే ఆమె వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త అనుమానించేవాడు. భర్తపైనా ప్రసన్నకు ఇదే అనుమానం ఉండేది.చున్నీ బిగించి ఊపిరి ఆడకుండా హత్య : భార్యాభర్తల మధ్య వివాదాలు ముదరడంతో సుధీర్‌రెడ్డి అడ్డు తొలగించుకోవాలని ప్రసన్న పథకం వేసింది. ఇంట్లో నిద్రిస్తున్న భర్త మెడకు చున్నీ బిగించి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసింది. ఆ తర్వాత తనకు ఏం తెలియనట్లు విజయవాడలో ఉండే బంధువులకు ఫోన్ చేసి తాగిన మైకంలో మంచంకోడు కొట్టుకుని భర్త చనిపోయినట్లు చెప్పింది."మా బ్రదర్‌ని వాళ్ల భార్య, కొడుకులు ఇద్దరు కలిసి చంపేశారు. ఇందులో పెద్ద కూమరుడి పాత్ర ఉంది. భార్యని ఒక్కదాన్ని జైల్లో పెట్టారు. ఆ అమ్మాయి చాలా గొడవలు పెట్టేది, చాలా హింసించేది. ఇలా గొడవల కారణంగా మొదట్లో పంచాయతీ పెట్టాము. తల్లి, కుమారులు ఇద్దరు కలిసి నా బ్రదర్‌ని కొట్టేశారు. వాళ్లు అలా కొట్టి కొట్టి మొన్న ఇంట్లో ఒక్కడే ఉండటంతో కొట్టి చంపేశారు. కొడుకు మెడలు పట్టుకున్నాడు, తల్లి చంపేసింది.ప్రసన్న వ్యక్తిత్వం గురించి పూర్తిగా తెలిసిన బంధువులు ఆమెపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగు చూసింది. తన వ్యసనాలు, సన్నిహిత సంబంధాలకు అడ్డుగా ఉన్నాడని భావించి భార్య ప్రసన్న భర్తను హతమార్చినట్లు తేలింది. అయితే భార్య ప్రవర్తనపై ముందు నుంచీ అనుమానంగా ఉన్న సుధీర్‌రెడ్డి హత్య జరగడానికి వారం రోజుల క్రితమే పోలీసులను ఆశ్రయించాడు. భార్యతో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ ఫిర్యాదు చేయడం విశేషం."నా కొడుకును చంపేశారు. పంచాయతీ పెట్టినప్పుడు అక్కడ మేము ఉండగానే మా ముందే పెద్ద కుమారుడు, తల్లి కలిసి నా కొడుకును కొట్టారు. ఇద్దరు కలిసి చంపేశారు. వాళ్లు తప్పించుకోవడానికి వీల్లేదు. భార్యభర్తల ఒటేనే ఒకరిపై ఒకరికి నమ్మకం ఉండాలి. అలా నమ్మకం అనే పునాదులపై నిర్మించిన కాపురాలే కలకాలం నిలుస్తాయి. అలా కాకుండా ఒకరిపై ఒకరు అనుమానంతో అనైతిక బంధాలు కొనసాగిస్తే ఇలాగే అర్థాంతరంగా ముగుస్తాయి. వివాహేతర సంబంధాల మోజులోపడి కట్టుకున్న భర్తను కడతేర్చడమేగాక మద్యం మత్తులో మంచంకోడు తగిలి చనిపోయాడంటూ నాటకమాడిన భార్య జైలు పాలయ్యింది.

# త్వరలో మారనున్న విజయవాడ నగర జంక్షన్ల రూపురేఖలు


**ట్రాఫిక్ పోలీసు విభాగం స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) తోడ్పాటుతో ప్రణాళిక**

**"టాక్టికల్ అర్బనిజం" ప్రధాన అంశంగా ప్రణాళిక**



పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి తగినట్లుగా కూడళ్లు లేక నగరం పద్మవ్యూహంలా మారింది. ఈ పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు ట్రాఫిక్ పోలీసు విభాగం స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) సాయం తీసుకుంటోంది. 'టాక్టికల్ అర్బనిజం' ప్రధాన అంశంగా ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. దీనిపై బుధవారం ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం, అధికారులతో కలసి స్పాను సందర్శించి డైరెక్టర్, బోధన సిబ్బందితో చర్చించారు. నగర అవసరాలకు తగ్గట్లుగా ముఖ్య కూడళ్లలో స్పా సర్వే చేసి డిజైన్లు, ప్రణాళికను అందజేయనుంది.స్వల్పకాలిక విధానం, తక్కువ ఖర్చు, ప్రజల భాగస్వామ్యంతో అర్బన్ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తారు. తక్కువ వ్యయంతో మంచి ఫలితాలు సాధించేందుకు ఈ పద్ధతి ఆచరిస్తారు. ముఖ్య కూడళ్లలో ఆక్రమణల తొలగింపు, అవరోధాలు లేకుండా ట్రాఫిక్ సాగడం, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ జోన్లను గుర్తించడం, పాదచారుల కోసం జీబ్రా లైన్లను వేయనున్నారు. వీఎంసీ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు తదితరులను భాగస్వాములను చేయాలనేది లక్ష్యం.ట్రాఫిక్ పోలీసులు గుర్తించిన ప్రధాన కూడళ్లలో తొలి దశ కింద మూడు ప్రాంతాలను ఎంపిక చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంతం, పటమట రైతుబజారు, రామవరప్పాడులోని అంకమ్మ తల్లి ఆలయం ప్రదేశాలపై స్పాలో ఉన్న పట్టణ ప్రణాళిక నిపుణుల బృందం అధ్యయనం చేయనుంది. ఈ ప్రాంతాల్లో ఈ బృందం ప్రస్తుత పరిస్థితులపై సమగ్రంగా అధ్యయనం చేసి, అక్కడ చేయాల్సిన మార్పులకు సంబంధించి రేఖా చిత్రాలు, సూచనలను అందజేయనుంది. తర్వాత నగరపాలిక, రహదారులు భవనాల శాఖ , సీఆర్డీఏ, తదితర శాఖలు, ఎంపీ నిధులతో అభివృద్ధి చేయనున్నారు.నగరంలో చాలా కూడళ్లు అభివృద్ధికి నోచుకోలేదు. ఎక్కడ చూసినా ఆక్రమణలతో ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధానంగా 12 ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. అమ్మవారి ఆలయ ప్రాంతం, కేఆర్ మార్కెట్, కేదారేశ్వరపేట, బీసెంట్ రోడ్డు, రాజగోపాలాచారి వీధి, పటమట రైతుబజారు, గుల్జార్ వంతెన, స్వాతి రోడ్డు, ప్రకాశం రోడ్డు, హైటెన్షన్ రోడ్డు, కృష్ణలంక అండర్‌పాస్, పీవీపీ మాల్ రోడ్డు ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ కూడళ్లలో అవరోధాలు తొలగించి, సుందరీకరణ చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు.చెన్నై-కోల్‌కతా హైవేలో ప్రకాశం జిల్లా ముప్పవరం నుంచి గుంటూరు జిల్లాలోని కాజ వరకు 100 కి.మీ. మేర యాక్సెస్ కంట్రోల్ కారిడార్‌గా మార్చే ప్రాజెక్ట్‌లో ముందడుగు పడింది. దీనికి సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) తయారీకి టెండర్లు పిలవగా, భోపాల్‌కు చెందిన ఎల్.ఎన్.మాలవ్య సంస్థ బిడ్ దక్కించుకుంది. డీపీఆర్ ఏడాదిలో సిద్ధం కానుంది. శ్రీ సత్యసాయి జిల్లాలోని కోడూరు నుంచి ప్రకాశం జిల్లాలో ముప్పవరం వరకు నిర్మిస్తున్న యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే (బెంగళూరు-అమరావతి హైవే)లోని వాహనాలు ముప్పవరం వద్ద చెన్నై-కోల్‌కతా హైవే (ఎన్‌హెచ్-16)లోకి చేరతాయి. వీటితో పాటు, అటు చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా కలిపి రాబోయే కాలంలో ముప్పవరం నుంచి గుంటూరు, విజయవాడ వైపు రద్దీ పెరిగే అవకాశాలున్నాయి. దీంతో సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా ముప్పవరం నుంచి కాజ దాటిన తర్వాత విజయవాడ బైపాస్ వరకు ఇప్పుడున్న హైవేని యాక్సెస్ కంట్రోల్‌గా కారిడార్‌గా మార్చాలని నిర్ణయించారు.

# పనిభారంపై శ్రీవారి అర్చకులు ఆందోళన



తిరుమల శ్రీవారి అర్చకులలో పనిభారంపై ఆందోళన నెలకొంది. ప్రతి సంవత్సరం స్వామివారికి 450కు పైగా ఉత్సవాలు, వేడుకలు నిర్వహిస్తుంటారు. వీటిని వంశపారంపర్య అర్చకులు, ముఖ్య అర్చకులు, అర్చకులు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించడంలో భాగస్వాములు అవుతున్నారు. నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, వార్షికోత్సవాలు నిర్వహించడంలో వారి పాత్ర చాలా కీలకమైనది. దీంతో తమ పై పని ఒత్తిడి నేపథ్యంలో కొత్తగా నియామకాలు చేపట్టాలని విన్నవిస్తున్నారు.అర్చకులపై పని ఒత్తిడి నేపథ్యంలో వారు టీటీడీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలకు ఇటీవల విన్నవించారు. వేద విద్యను అభ్యసించి ఆలయ కైంకర్యాలపై సనాతన సంప్రదాయాలు పాటిస్తూ కైంకర్యాలు చేసే నైపుణ్యం ఉన్న అర్హత గల వారిని అర్చకులుగా నియమించాలని వారు కోరారు.మిరాశీ వంశపారంపర్య అర్చకుల సలహాల మేరకు భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ఆధారంగా నిర్ణయించి మిరాశీయేతర వ్యక్తులను కూడా భర్తీ చేయాలని, తద్వారా తమ సంప్రదాయాల అమలుతో పాటు తమకు ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేయగా టీటీడీ అధికారులు వారి అభ్యర్థనను పరిశీలిస్తున్నట్లు సమాచారం.తిరుమలలో మిరాశీ వంశపారంపర్య అర్చకులుగా నాలుగు కుటుంబాలు స్వామివారికి సేవలు చేస్తున్నారు. వీరి పర్యవేక్షణలో జీయంగార్లు కీలక పాత్ర వహిస్తున్నారు. ప్రధాన అర్చకులను గొల్లపల్లి, పెద్దింటి, పైడిపల్లి, తిరుపతమ్మగారి కుటుంబాల నుంచి మాత్రమే ఎంపిక చేస్తారు. ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సుమారు 49 మంది అర్చకులు పని చేస్తున్నారు. అదే విధంగా ఈ కుటుంబాలకు 'చెందని'వారు కొందరు స్వామివారి ఆలయంలో కైంకర్యపరులు (అర్చకులు)గా సేవలు కొనసాగిస్తున్నారు.మిరాశీ కుటుంబాల్లో ఎవరైనా మరణించినా లేదా ఆ ఇళ్లలోని మహిళలు రుతుస్రావం కారణంగా ఇంటికి దూరమైనా లేదా ఇతర నిషేధిత రోజుల్లో అయినా వారు తమ విధులను నిర్వర్తించడానికి అనుమతి లేదు. ఈ సమయంలో మిగతా అర్చకులపై పని భారం పడుతుంది. ఇలా సుమారుగా వారం నుంచి 10 రోజుల పాటు వారి సేవలు దూరమై ఇతర అర్చకులు ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. ఈ నాలుగు కుటుంబాల నుంచి సుమారుగా 30 మంది వరకు పని చేస్తున్నారు. వీరితో పాటు ఇతర అర్చకులు ఇటీవల వయోభారంతో ఉద్యోగ విరమణ చేస్తున్నారు. 2 ఏళ్లలో 6 నుంచి 7 ఈ జాబితాలో చేరనున్నారు. ఇతర ఆలయాల్లో ఉత్సవాలకు తిరుమల నుంచే అర్చకులు వెళ్తుంటారు. ఉత్సవాల సమయంలో ఎవరైనా సెలవు తీసుకుంటే గనక ఆ పని ఒత్తిడి మరింత తీవ్రంగా ఉంటుంది.

## ఎల్కతుర్తి హై స్కూల్‌లో సీఎం కప్ గ్రామీణ స్థాయి క్రీడల ప్రారంభం





**ఎల్కతుర్తి జనవరి 22 (ప్రజా మంటలు) :** జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ గ్రామీణ స్థాయి క్రీడలను గ్రామ సర్పంచ్ మునిగడప లావణ్య శేషగిరి , ఎంపీడీవో విజయ్ కుమార్ ,ఉపసర్పంచ్ గోడిశాల రాజు గౌడ్ వార్డ్ నెంబర్ లు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ క్రీడలను ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.గ్రామీణ ప్రాంత యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సర్పంచ్ సూచించారు. సీఎం కప్ వంటి పోటీలు గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు దుర్గాబాయి,వార్డ్ మెంబర్లు అంభాల స్వరూప, మాటూరి వసంత , శనిగరపు స్వరూప,అంబాల ప్రత్యూష, నాంపల్లి మమత, కొత్తకొండ అజయ్, జన్నారపు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ , పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అయోధ్య బాల రాముడు విగ్రహ ప్రాణ ప్రతిష్ట రెండవ వార్షికోత్సవము సందర్భంగా శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో పూజలు



**జగిత్యాల జనవరి 22 (ప్రజా మంటలు) :** ఇదే రోజు 2024న అయోధ్యలో బాల రాముడు విగ్రహ ప్రాణ ప్రతిష్ట ఈ సందర్భంగా రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని ఎడ్ల అంగడిలో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు మాజీ కౌన్సిలర్ జరిగింది అరవ లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక సమరసత వేదిక అధ్యక్షులు చిట్ల గంగాధర్ భారత్ సురక్ష సమితి ప్రధాన కార్యదర్శి కార్యదర్శి న్యాయవాది అక్కినపల్లి కాశీనాథములు మాట్లాడుతూ దాదాపు 500 సంవత్సరాల తరువాత అనేకమంది యువకుల ప్రాణ త్యాగాల ఫలితంగా అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించుకోవటం జరిగిందని ప్రధానంగా అద్వానీ శ్రీరామ జన్మభూమి రథయాత్ర, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది హిందువుల కల సాకారం అయ్యిందని కొనియాడారు. దేవాలయాల రక్షణకు ధర్మరక్షణకు హిందువులు సంఘటితం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరొకసారి అవకాశం కల్పించి రామరాజ్య స్థాపనకు అవకాశం కూడా ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు జాబితాపూర్ వెంకట్రావు నర్సింగారావు మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు కొండపల్లి నర్సింగరావు చిరంజీవి ఆనందరావు పైడిపల్లి రాఘవరావు ఎన్ వెంకటేశ్వరరావు బా.సు.స కార్యదర్శి సింగం గంగాధర్ ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు సమరసత వేదిక పట్టణ అధ్యక్షుడు బొందుకూరు శ్రీనివాస్ విహెచ్పి కోశాధికారి మామిడాల రాములు న్యాయవాది అనుమల భుజంగం ఎడమల వెంకట్ రెడ్డి కొత్తకొండ బాలన్న ఆర్ఎస్ఎస్ వీరన్న మాడంపల్లి గంగాధర్ కొక్కుల ఆంజనేయులు నరేందర్ రాజు గొల్లపెల్లి సత్యనారాయణ గౌడ్ మరియు రంజిత్ అయ్యగారి బృందం తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ పట్టణ సమగ్ర అభివృద్ధి కి కృషి చేస్తా

**ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**



**రాయికల్ జనవరి 22 (ప్రజా మంటలు) :** రాయికల్ పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. పద్మశాలీ సేవా సంఘంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో రాయికల్ పట్టణం లో గతంలో పని చేసిన కాంట్రాక్టర్లకు 3 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్ లకు చెల్లింపు చేయడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం లో 4 కోట్ల పనులు రాయికల్ పట్టణం లో చేయటం జరిగింది.. 82 లక్షలతో నూతన పనులకు అనుమతులు రావడం జరిగింది.15 కోట్ల రాయికల్ పట్టణ అభివృద్ధి కి నిధులు మంజూరు అయ్యాయి.7.20 కోట్ల లో 1 కోటి తో మున్సిపల్ పార్కు అభివృద్ధి చేస్తున్నాం.20 లక్షల తో డివైడర్ పనులు,3.15 కోట్ల సి సి రోడ్లు డ్రైనేజీ లు పనులు పట్టణం లో జంక్షన్ ల అభివృద్ధి కి 1 కోటి కేటాయింపు చేయటం జరిగింది.5 కోట్ల నిధులు స్టార్మ్ వాటర్ డ్రైనేజీ కి 4 చోట్ల పెద్ద డ్రైనేజీలకి కేటాయింపు చేయటం జరిగింది.15 కోట్ల తో రాయికల్ మున్సిపల్ సమగ్ర అభివృద్ధి చేస్తాం.స్మశాన వాటిక అభివృద్ధి కోసం 50 లక్షలు ,1 కోటి రూపాయలు రాయికల్ రామాజీ పెట్ వీధి దీపాలు కు కేటాయించడం జరిగింది.మహిళా సంఘాల కు 11 లక్షల వడ్డీ లేని రుణాలు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయటం జరుగుతుంది అని అన్నారు.నా పై కావాలనే తప్పుడు ఆరోపణలు.అగ్రిమెంట్ లేకుండా ఎలాంటి పనులు సాగవు.జగిత్యాల పట్టణంలో వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రజల కోసం అభివృద్ధి పనులు చేపట్టిన అన్ని తెలిసిన వాళ్ళే పదే పదే విమర్శలు చేస్తే అబద్ధాలు నిజం కావు గెలిపించిన ప్రజల కోసం అభివృద్ధి చేసి చూపిస్తా.ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ఎమ్మెల్యే శ్రీగణేశ్ దీక్షకు మహిళల మద్దతు


**మూడో రోజుకి చేరిన కంటోన్మెంట్ విలీనం దీక్ష**




**సికింద్రాబాద్, జనవరి 22 (ప్రజామంటలు) :** రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్‌లో కంటోన్మెంట్ బోర్డు విలీనాన్ని డిమాండ్ చేస్తూ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మూడో రోజుకు చేరుకుంది. గురువారం జరిగిన దీక్షలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని తమ మద్దతు ప్రకటించారు.మూడో రోజు దీక్ష సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కాలనీలుబస్తీల ప్రజలు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కోట నీలిమ, సికింద్రాబాద్, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ జాన్, తోటకూర వజ్రేష్ యాదవ్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సికింద్రాబాద్ బార్ అసోసియేషన్, ఓల్టాస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు సహా పలువురు నేతలు దీక్షకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూడ కంటోన్మెంట్ బోర్డు విలీనానికి జరుగుతున్న ఈ పోరాటం ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన ఉద్యమమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేస్తే ఇది మరింత పెద్ద ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు. మహిళల భారీ సంఖ్యలో పాల్గొనడం ఈ పోరాటానికి బలాన్ని ఇస్తోందని పేర్కొన్నారు.కంటోన్మెంట్ ప్రాంత ప్రజలను అభివృద్ధికి దూరంగా ఉంచడం అన్యాయమని, నిధులు లేని కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు న్యాయం చేయలేదని విమర్శించారు. ఎంపీ ఈటెల రాజేందర్ ఈ అంశంపై స్పందించి కంటోన్మెంట్ బోర్డు విలీనానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీ పార్టీకి తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు.మహిళల భాగస్వామ్యంతో కొనసాగుతున్న ఈ దీక్ష ప్రజా ఉద్యమంగా మారుతూ ముందుకు సాగుతోందని నాయకులు తెలిపారు.

## 84 లక్షల ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం పున ప్రారంభించిన

**ఎస్టి ఎస్సి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**వెల్గటూర్ జనవరి 22 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామంలో గతంలో ట్రాన్స్ఫార్మాల కాపరమైన దొంగలించి లిఫ్ట్ నడవక రైతులు నానా ఇబ్బందులకు గురయ్యారు. రైతులు మంత్రి దృష్టికి తీసుకుపోగా ఇబ్బందులను తొలగించడానికి ఇరిగేషన్ మంత్రి ఉత్త కుమార్ రెడ్డి కి ప్రత్యేకంగా విన్నవించి మంజూరు ఇప్పించారు. ఏసంగి పంటకు నీరు అందిస్తానని హామీ ఇచ్చి మాట నిలుపుకున్న లక్ష్మణ్ కుమార్ కు ఎత్తిపోతల పథకం సంఘం అధ్యక్షుడు సంఘ రాయలింగు,పాలకవర్గం మరియు నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీ సర్పంచి కుషన పెల్లి లక్ష్మి పోషమాళ్ళు,ఉపసర్పంచ్ మహమ్మద్ అక్రమ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు గుండాటి గోపిక జితేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గొళ్ల తిరుపతి, కోటిలింగాల దేవస్థానం చైర్మన్ పూదరి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనుమాల మంజుల శ్రీనివాస్, బైరం లచ్చిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు మురళి గౌడ్, నరేష్ గౌడ్, తహసిల్దార్ రాపల్లి శేఖర్, మండలాభివృద్ధి అధికారి పాడి వెంకటప్రసాద్, ఇరిగేషన్ అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు. రాంనూర్ సర్పంచ్ గా ఎన్నికైన తిరుపతి ఆధ్వర్యంలో పాలకవర్గం కాంగ్రెస్ పార్టీలో లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా కండువా కప్పుకొని పార్టీలో చేరారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com